SPOT EDITION
2PM

www.ninadam.co.in

# నినాదం

బుధవారం 27-3-2024

నిఖార్సైన జర్నలిజం

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# ఈడీ... దూకుడు

## పలు ప్రాంతాల్లో దాడులు..!




**న్యూఢిల్లీ, మార్చి 27 (నినాదం న్యూస్) :** ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత దీపక్ సింగ్లా, చండీగఢ్ లోని ఆ రాష్ట్ర ఎక్సైజ్ కమిషనర్ వరుణ్ రూజం నివాసాలతో సహా పంజాబ్ లోని పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఈ దాడులు కొనసాగుతున్న ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసుతో ముడిపడి ఉన్నాయా అనేది స్పష్టంగా లేనప్పటికీ., జామ తోటల పరిహారం స్కామ్ సంబంధించి లింక్డ్ మనీ లాండరింగ్ కేసులో భాగంగా ఫెడరల్ ఏజెన్సీ దాడులు నిర్వహిస్తోందని తెలుస్తోంది. అంతకు ముందు మార్చి 23న దేశ రాజధానిలోని ఆప్ ఎమ్మెల్యే గులాబ్ సింగ్ యాదవ్ నివాసంలో ఈడీ దాడులు నిర్వహించడం గమనార్హం. మరోవైపు ఎక్సైజ్ పాలసీ కేసులో తన అరెస్టును వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు విచారణ జరుపుతోంది. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో మరిన్ని విషయాలు త్వరలో ప్రజల ముందుకు రాబోతున్నాయి. ప్రస్తుతం ఈ సోదాలని చూస్తే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన దూకుడును పెంచినట్లుగా అర్థమవుతుంది.

# బీజాపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్

## ఆరుగురు మావోయిస్టులు మృతి



ఛత్తీస్‌గఢ్:బీజాపూర్ జిల్లాలో బుధవారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీపురుబట్టి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న భద్రతా బలగాలకు, మావోయిస్టులు తారసపడ్డారు. దాంతో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో దళం డిప్యూటీ కమాండర్‌తోపాటు ఒక మహిళ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. భద్రతాబలగాలు, పోలీసులకు మధ్య ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయి. కోబ్రా 210, 205, సి ఆర్‌పీఎఫ్ 229 బెటాలియన్, డిఆర్‌జి జవాన్లు మావోయిస్టులతో పోరాడు తున్న భద్రతా దళాల్లో ఉన్నారు. మరణించిన నక్సలైట్ల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. సంఘటనా స్థలంలో ఉన్న ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్, కోబ్రా, సిఆర్‌పీఎఫ్ అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. హోలీ రోజున నక్సలైట్లు ఈ ప్రాంతంలో ముగ్గురు గ్రామస్థులను చంపారు.

# ఎన్ఐఏ దాడులు

## రామేశ్వరం కేఫ్ పేలుళ్ల కేసుపై అనేక చోట్ల ఏకకాలంలో దాడులు చేసిన ఎన్ఐఏ..!




**న్యూఢిల్లీ, మార్చి 27 (నినాదం న్యూస్) :** రామేశ్వరం కేఫ్ పేలుళ్ల కేసుకు సంబంధించి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బుధవారం బెంగళూరు, శివమొగ్గ జిల్లాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా బెంగళూరు నగరంలోని ఐదు చోట్ల, శివమొగ్గ జిల్లా తీర్థహల్లి పట్టణంలోని కొన్ని ఇళ్లపై ఎన్ఐఏ దాడులు నిర్వహించింది. రామేశ్వరం కేఫ్ పేలుళ్ల కేసులో బాంబు పెట్టిన అతనికి ప్రత్యక్ష సంబంధం, అతనికి ఆర్థిక సహాయం అందించిన అనుమానిత వ్యక్తులపై దాడులు నిర్వహించినట్లు వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎన్ఐఏ చర్యలపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఇకపోతే ఇప్పటివరకు బెంగళూరులోని రామేశ్వరం కేఫ్ లో పేలుడు ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను ఏజెన్సీ మంగళవారం అదుపులోకి తీసుకుంది. అనుమానిత బాంబర్ తో ఇద్దరు నిందితులు ప్రత్యక్ష సంబంధంలో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలుస్తోంది. ఈ ఇద్దరు అనుమానితుల సమాచారం మేరకు దాడులు నిర్వహిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎన్ఐఏ, పోలీసు బృందాలు వివిధ రాష్ట్రాల్లో విస్తృతంగా సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించినప్పటికీ, బాంబర్ అంతుచిక్కడం లేదు. రామేశ్వరం కేఫ్ పేలుళ్ల ఘటన జరిగిన వెంటనే అధికారులు మార్చి 1న బాంబర్ చిత్రాలు, వీడియోలను సీసీటీవీ ఫుటేజీ నుంచి స్వాధీనం చేసుకున్నారు. బాంబు పేలుడుకు పాల్పడిన వ్యక్తి తమిళనాడు నుంచి వచ్చి రెండు నెలల పాటు ఉండి పేలుడుకు పాల్పడ్డాడని నిఘావర్గాలు అనుమానిస్తున్నట్లు సమాచారం. నిందితుడి జుట్టు నమూనాలను నిందితుడి టోపీ నుండి సేకరించారు. దానిని అతను బెంగళూరులో ఒక మతపరమైన ప్రదేశం సమీపంలో వదిలిపెట్టాడు. డీఎన్ఏ పరీక్షల కోసం జుట్టు శాంపిల్స్‌ను పంపిన అధికారులు వాటి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. మార్చి 1న బ్రూక్ ఫీల్డ్ ప్రాంతంలో ఉన్న రామేశ్వరం కేఫ్ లో బాంబు పేలుడు జరిగింది. ఈ పేలుడుకు తక్కువ తీవ్రత ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ను ఉపయోగించబడింది. ఇక ఈ సంఘటనలో తొమ్మిది మంది వ్యక్తులు గాయపడ్డారు.

# కొత్త పంచాయితీ

## బీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య పేలుతున్న మాటల తూటాలు

**మెదక్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్య మాటల, తూటాలు పేలుతున్నాయి. ఈ రెండు పార్టీల అభ్యర్థులే కాదు, వాళ్ల అనుచరులు కూడా అసలు తగ్గడం లేదు. దీంతో ఆ పార్లమెంట్ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. ఇంతకీ ఇదంతా ఏ పార్లమెంట్ పరిధిలో అనుకుం టున్నారా..? అదే మెతుకు సీమ మెదక్ లోక్‌సభ నియోజకవర్గం..! పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మెదక్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.**



**హైదరాబాద్, మార్చి 27 (నినాదం న్యూస్):** తాజాగా బీఆర్ఎస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామ రెడ్డికి టికెట్ ఖరారు చేయడంతో ఒక్కసారిగా రాజకీయం మరింత హీట్ పెంచేసింది. పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారం ప్రారంభించక ముందే, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు,కార్యకర్తలు ఎవరికి వారే తగ్గేదేలేదని అంటున్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ అన్నట్లుగా మారింది. ఈ రెండు పార్టీల మధ్య లోకల్, నాన్ లోకల్ గొడవ రోజు రోజుకు తారాస్థాయికి చేరుకుంటుది. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు బీఆర్ఎస్ పార్టీపై తీవ్ర స్థాయిలు విమర్శలు చేస్తూ రాజకీయాలను హిట్ ఎక్కించారు. ఇక బీఆర్ఎస్ నేతలు కూడా అంతే సీరియస్ గా కౌంటర్ అటాక్ చేస్తున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా రఘునందన్ రావు పేరును ఆపార్టీ ప్రకటించిన కొద్దిరోజులకే బీఆర్ఎస్ పార్టీ తమ పార్టీ నుండి ఎంపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామ్ రెడ్డి పేరును ఖరారు చేసింది. ఇదే ఇప్పుడు రచ్చకు దారి తీసింది. బీఆర్ఎస్ ఎంపీ టికెట్ వెంకట్రామ్ రెడ్డికి ఎలా ఇస్తారు.. అసలు అతను స్థానికుడు కాదు అని, ఉద్యమకారులు ఆ పార్టీలో లేరని కామెంట్స్ చేశారు బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు. ఇలా వెంకట్రామ్ రెడ్డి పైనే కాకుండా, బీఆర్ఎస్ పార్టీ పై, పార్టీ అధినేత కేసీఆర్ పై, మాజీ మంత్రి హరీష్ రావు పై పలు కామెంట్స్ చేశారు రఘునందన్ రావు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ పార్టీకి స్థానిక అభ్యర్థి దొరకకపోవడం బాధాకరం అని, వందల కోట్ల రూపాయలు తీసుకుని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ సీట్లు అమ్ముకుంటుందని, మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డి నాన్ లోకల్ వ్యక్తి అని, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విమర్శలు గుప్పిస్తున్నారట. రఘునందన్ చేస్తున్న వ్యాఖ్యలపై చాలా సింపుల్ గా స్పందించారు బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామ్ రెడ్డి. నాన్ లోకల్ వ్యక్తిని కాదని, తాను మెదక్ పార్లమెంటు పరిధిలోనే ఉండే వ్యక్తిని అని తేల్చి చెప్పేశారు. కానీ బీఆర్ఎస్ అధినేతపై, బీఆర్ఎస్ పార్టీ పై,ఎంపీ అభ్యర్థి పై రఘునందన్ రావు చేసిన వ్యాఖ్య పై మెదక్ పార్లమెంట్ పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు. గుజరాత్‌కు చెందిన మోదీ ఎన్నికల్లో ఎక్కడబడితే అక్కడ పోటీచేయవచ్చా అని ప్రశ్నించారు. కరీంనగర్‌కు చెందిన ఈటల రాజేందర్, ఎంపీగా మల్కాజిగిరిలో పోటీ చేయడంపై బీజేపీ పార్టీని రఘునందన్ ముందు ప్రశ్నించాలంటున్నారు బీఆర్ఎస్ శ్రేణులు. మెదక్ పార్లమెంటు పరిధిలోని బీజేపీలో ఉన్న సీనియర్ నేతలను పక్కనబెట్టి రఘునందన్ టికెట్ తెచ్చుకోలేదా అని రఘునందన్ కు గట్టిగానే కౌంటర్ ఇస్తుంది బీఆర్ఎస్ పార్టీ. ఇలా ఉమ్మడి మెదక్ పార్లమెంటు పరిధిలో బీజేపీ, బీఆర్ఎస్ నేతల మధ్య లోకల్, నాన్ లోకల్ గొడవతో పాటు, రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతుందట.. ఎంపీ ఎన్నికల ప్రచారం ఇంకా మొదలు కాక ముందే ఇలా ఉంటే.. పూర్తి స్థాయిలో ప్రచారం మొదలు అయితే ఇంకా ఎలా ఉంటుందో అనే ఆలోచనలో పడ్డారట రాజకీయ విశ్లేషకులు.

### తెలంగాణలో వచ్చే మూడు రోజులు

# జాగ్రత్తగా ఉండాలి..!

**హైదరాబాద్, మార్చి 27 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. మార్చి చివరి వారంలోనే భానుడు భగభగ మంటు చుక్కలు చూపిస్తున్నాడు. ఇక, ఈ ఏడాదిలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు ఆదిలాబాద్ జిల్లాలో నమోదు అవుతున్నాయి. రికార్డు స్థాయిలో మంగళవారం నాడు 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది అని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.. అయితే, ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు, జైనథ్ మండలాల్లో నిన్న (మంగళవారం) గరిష్ఠంగా 42.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. బేల మండలం చప్రాలలో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు అయిందని పేర్కొన్నారు. ఇక?, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లో 42 డిగ్రీలు నమోదు కాగా, మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 12 జిల్లాల్లో 40. 8 డిగ్రీల నుంచి 42. 3 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు వెదర్ డిపార్ట్మెంట్ తెలిపింది. అయితే, రానున్న మూడు రోజులు కూడా సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కాగా.. రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంస్థ ఎండల పెరుగుదలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది. ఎండలో పని చేసే వారు, మధ్యాహ్నం పూట ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు సైతం ఎక్కువగా ఎండలో తిరగరాదని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. పలు చోట్ల వర్షం కురిసిన్నట్టు వాతావరణ శాఖ అధికారులు చెప్పుకొచ్చారు.

# హైకోర్టులో దానం నాగేందర్‌కి వ్యతిరేకంగా పిటిషన్



తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌కి వ్యతిరేకంగా పిటిషన్ దాఖలు అయింది. దానం నాగేందర్ పై అనర్హత వేటు వేయాలని రాజు యాదవ్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశాడు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీపై గెలుపొందిన దానం.. ప్రస్తుతం ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.. గత కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీలో ఆయన చేరినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇక, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున దానం నాగేందర్ బరిలో ఉన్నారు. అయితే, ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి రాజీనామా చేయకుండా మరో పార్టీ నుంచి ఎంపీగా దానం నాగేందర్ పోటీ చేయడం చట్ట విరుద్ధం.. ఇది రాజ్యాంగ విరుద్ధం అని పిటిషనర్ రాజు యాదవ్ పేర్కొన్నారు. వెంటనే దానం నాగేందర్ పై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చర్యలు తీసుకోవాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశాడు. ఇక, దానంపై అనర్హత వేటు వేయాల్సిందిగా స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని హైకోర్టును పిటిషనర్ కోరారు. అయితే, దీనిపై రేపు హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

### నేటి నుంచి ఐదు రోజుల పాటు వేములవాడలో

# శివ కళ్యాణ మహోత్సవాలు



**వేములవాడ:** తెలంగాణలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో శివ కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నేటి నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.. అయితే తెలుగు రాష్ట్రాలలోని అన్ని శివాలయాల్లో శివరాత్రి రోజున శివ కళ్యాణం జరిగితే వేములవాడలో మాత్రం కామ దహనం అనంతరం త్రిరాత్రి ఉత్సవాలు నిర్వహించిన తర్వాత శివ కళ్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఇక, ఈ ఆలయంలోని స్వామి వారి కళ్యాణ మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమశంకర శర్మ నేతృత్వంలో అర్చకులు స్వస్తి పుణ్యాహవాచనంతో ఉత్సవాలు వేద మంత్రాలతో ప్రారంభమయ్యాయి. పంచగవ్య మిశ్రణము, దీక్షాధారణము, ఋత్విక్ వరణము, మంటప ప్రతిష్ట, గౌరి ప్రతిష్ట, నవ గ్రహ ప్రతిష్ట, అంకురార్పణ, వాస్తు హోమం, అగ్ని ప్రతిష్టతో పాటు శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు వేద పారాయణములు, పరివార దేవతార్చనలు నిర్వహించారు. శుక్రవారం నాడు అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీ స్వామివారి కళ్యాణ మంటపంలో శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. అయితే, రేపు (గురువారం) జరిగే శివ కళ్యాణాన్ని తిలకించేందుకు చైర్మన్ చాంబర్ ముందు ప్రత్యేకంగా కళ్యాణ మంటపం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. గోపురాలను విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. అలాగే ప్రత్యేకంగా చలువ పందిళ్ళు, తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు.

# కావాలనే నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

## తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, మార్చి 27 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ఉగ్ర నరసింహా అవతారమెత్తారు. ఒక్కసారిగా కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోయారు. తనపై విష ప్రచారాలు చేస్తే నాశనం అయిపోతారంటూ శాపనార్థాలు పెట్టారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళా ఫైర్ బ్రాండ్‌గా, పాపులర్ మహిళ నాయకురాలుగా ప్రత్యేక గుర్తింపున్న మంత్రి సీతక్క ఒకసారిగా ఆగ్రహావేశాలకు గురయ్యారు. కోపంతో ఊగిపోతూ తనపై తప్పుడు ప్రచారాలు చేసే వారిపై శాపనార్థాలు పెట్టారు. కలమశం తెలియని తనపై విమర్శలు చేస్తే నాశనం అయిపోతారని ఆగ్రహంతో హెచ్చరించారు. సీతక్క ఆగ్రహానికి అసలు కారణం ఇదే సీతక్కకు విపరీతమైన సోషల్ మీడియా ఫాలోయింగ్ ఉంటుంది.. సీతక్కపై ఏ పోస్ట్ పెట్టినా ఫుల్ రేటింగ్ వస్తుంది. సోషల్ మీడియాలో ఆమెకు ఫుల్ క్రేజ్. అయితే సోషల్ మీడియా ప్రచారం ఇప్పుడు అదుపు తప్పింది. అదే సోషల్ మీడియా ఎక్కడ ఏం జరిగినా సీతక్కకు అంట కడుతూ విష ప్రచారాలు చేస్తున్నారట. ఎవరో చేసిన తప్పులను తనకు అంటకట్టి వ్యూస్ కోసం విష ప్రచారాలు చేస్తున్నారట. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా తనను టార్గెట్ చేసి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారట. ఇటీవల మహబూబాబాద్‌లో ACB కి చిక్కిన మహిళా సబ్ రిజిస్ట్రార్‌తో తనకు సంబంధం అంటకట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహించారు. గతంలో తన ప్రయివేట్ PA తనకు తెలియకుండా ఏదో ఫైరవీ చేస్తే వెంటనే తోగించి తన నిజాయితీని నిరూపించుకుంటే, అది కూడా తనకే అంట కట్టి బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించారు. సొంత ఛానళ్ళు, యూట్యూబ్ లు పెట్టుకుని వ్యూస్ కోసం తన పై బురద జల్లతే నాశనం అవుతారని హెచ్చరించారు. ఇష్టానుసారంగా దుష్ప్రచారం చేసినవాళ్ళు బాగుపడి, బట్టకట్టరని ధ్వజమెత్తారు.. దుర్మార్గపు దృష్ప్రచారాలను ప్రజలు అర్థం చేసుకుంటున్నారని..కచ్చితంగా ఆ ఆడబిడ్డ శాపం తగిలి నాశనమైపోతారని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాలతో మా ఇమేజ్ దెబ్బతీయాలని కుట్ర జరుగుతోందని ఆరోపించిన సీతక్క ఇలాంటి కుట్రలు చేస్తే మీపార్టే బలవుతుందని బీఆర్ఎస్ నేతలకు హిత బోధ చేశారు. కవిత అంత దుర్మార్గపు స్కామ్‌లో ఉన్న ఒక ఆడకూతురుగా ఎలాంటి విమర్శలు చేయలేదని గుర్తు చేశారు. కానీ నాలాంటి ఆడకూతురు నిజాయితీగా సేవచేస్తే తప్పుడు ప్రచారం చేస్తున్నారని తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు మంత్రి సీతక్క.